క్లుప్తంగా

ఆర్టీసీ బస్సు మొరాయించడంతో ప్రయాణికుల అవస్థలు



రోడ్డుపై నిలబడిన ప్రయాణికులు

కూడేరు: కాలం చెల్లిన ఆర్టీసీ బస్సులతో ప్రయాణికులకు అవస్థలు తప్పలేదు. నిర్వాహణ, పర్యవేక్షణ సక్రమంగా లేకపోవడంతో బస్సులు మార్గమధ్యంలో ఎక్కడబడితే అక్కడ మొరాయిస్తున్నాయి. శుక్రవారం అనంతపురం డిపోకి చెందిన బస్సు అనంపురం నుంచి ఉరవకొండకు వెళ్తోంది. సుమారు 35 మంది దాకా ప్రయాణికులు ఉన్నారు. అరవకూరు వద్దకు రాగానే గేర్ బాక్సు మొరాయించింది. దీంతో డ్రైవర్ బస్సును నిలిపి వేశారు. గంట పాటు ప్రయాణికులు అవస్థలు పడ్డారు. తర్వాత మరో బస్సు రావడంతో అందులో వెళ్లి పోయారు.

యోగాసనాలపై శిక్షణ



యోగాపై శిక్షణ ఇస్తున్న గురువు ఓబులేసు

ఉరవకొండ: స్థానిక ఆర్టీసీ డిపో ప్రాంగణంలో ఆర్టీసీ ఉద్యోగులకు యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా శుక్రవారం యోగాపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఉరవకొండకు చెందిన యోగా గురువు ఓబుళేసు గురూజీ ఆధ్వర్యంలో ఆర్టీసీ డీఎం హంపన్నతో పాటు ఉద్యోగులు యోగాసనాలు వేశారు. యోగా గురువు మాట్లాడుతూ యోగాను రోజూ అలవాటు చేసుకోవాలని యోగాతో సర్వ రోగాలు దూరమవుతాయని, మానసిక ప్రశాంతతకు యోగా ఎంతో అవసరమన్నారు. కార్యక్రమంలో ఆర్టీసీ ఉద్యోగులు, గ్యారెజీ సిబ్బంది పాల్గొన్నారు.

ఉచితంగా పరికరాల పంపిణీ

కూడేరు: దివ్యాంగులు, వృద్ధులకు ఉచితంగా పరికరాలు అందించనున్నట్లు ఎంపీడీఓ కుళ్లాయి స్వామి శుక్రవారం తెలిపారు. మండలంలో ఉన్న దివ్యాంగులు, వృద్ధులు ఈ నెల 15న ఉరవకొండలోని ఎస్కే గవర్నమెంట్ హైస్కూల్‌లో నిర్వహించనున్న కార్యక్రమంలో దివ్యాంగుల సదరం సర్టిఫికెట్, ఆధార్, రేషన్ కార్డు జిరాక్స్ కాపీలు రెండు సెట్లు , నాలుగు ఫొటోలు, అలాగే వృద్ధులైతే ఆధార్, రేషన్ కార్డు జిరాక్స్ కాపీలు రెండు సెట్లు, నాలుగు ఫొటోలు ఇవ్వాలన్నారు.

ఈ-కేవైసీ కోసం రైతుల తోపులాట

కూడేరు: కూడేరు, ఉదిరిపికొండ, కొర్రకోడుతో పాటు ఇతర రైతు సేవా కేంద్రాలకు రైతులు ఈ కేవైసీ చేయించుకునేందుకు అధిక సంఖ్యలో రావడంతో శుక్రవారం తోపులాట జరిగింది. 'అన్నదాత సుఖీభవ' పథకం ద్వారా బ్యాంక్ ఖాతాల్లోకి నగదు జమ కావాలంటే రైతులు ఆధార్ కార్డు తెచ్చి రైతు సేవా కేంద్రాల్లో ఈ-కేవైసీ చేయించుకోవాలని వ్యవసాయాధికారులు చాటింపు వేయించడంతో రైతులు పెద్ద సంఖ్యలో చేరుకున్నారు. ఎంపీఈఓలు, వీఏఏల వద్ద గుమికూడి ఈ-కేవైసీ చేయించుకునేందుకు పోటీపడ్డారు. దీంతో రైతుల మధ్య తోపులాట చోటు చేసుకుంది. దీంతో మహిళా రైతులు, వృద్ధులు అవస్థలు పడ్డారు.

గుండె పోటుతో వైఎస్సార్ సీపీ నాయకుడి మృతి

కుందుర్పి: మండలంలోని కలిగొలిమికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు నారాయణప్ప (46) గుండెపోటుతో శుక్రవారం మృతి చెందాడని ఎంపీపీ కమలా నాగరాజు, సర్పంచ్ గంగాధర తెలిపారు. నారాయణప్పకు గురువారం రాత్రి గుండెపోటు రావడంతో చికిత్స నిమిత్తం అనంతపురం తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడికి ఇద్దరు కూతుర్లు, కుమారుడు ఉన్నారు. ఎంపీపీ, సర్పంచ్‌తో పాటు మాజీ సర్పంచ్ ఈశ్వరప్ప తదితరులు నివాళి అర్పించారు.



టీ సర్కిల్ సమీపంలో ప్రమాదకరంగా మారిన కల్వర్టు



శ్రీవాసవి కాంప్లెక్స్ వద్ద అర్ధంతరంగా ఆగిన డ్రైనేజీ పనులు

ఎక్కడి పనులు అక్కడే

- దుర్గంలో అస్తవ్యస్తంగా డ్రైనేజీ నిర్మాణ పనులు
- ఆరు నెలలైనా పట్టించుకోని వైనం
- అవస్థలు పడుతున్న ప్రజలు
- వ్యాపారాలు జరగక తోపుడు బండ్లు, దుకాణాల యజమానుల ఆందోళన

కళ్యాణదుర్గం: కళ్యాణదుర్గంలో డ్రైనేజీ నిర్మాణ పనులు అస్తవ్యస్తంగా ఉన్నాయి.. పట్టణంలోని ప్రధాన టీ సర్కిల్ సమీపంలో డ్రైనేజీ నిర్మాణ పనులు అర్ధంతరంగా నిలిపివేయడంతో ప్రజలకు అవస్థలు తప్పడంలేదు. డ్రైనేజీ వ్యవస్థ రూపురేఖలు మారుస్తామని చెబుతున్న టీడీపీ నేతలు.. నెలల తరబడి ఎక్కడికెక్కడ పనులు నిలిచిపోయినా పట్టించుకోలేదనే విమర్శలు సర్వత్రా వినిపిస్తున్నాయి. కళ్యాణదుర్గంలో పాత బస్టాండ్ వద్ద డ్రైనేజీ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతామని ఆర్భాటంగా చెప్పిన ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు ఆ దిశగా పనులు చేయించడంలో విఫలమయ్యారనే విమర్శలున్నాయి. జనవరి నెలలో డ్రైనేజీ పనులు ప్రారంభించారు. ఆరు నెలలు అయినా పనుల పురోగతి కనిపించలేదు.

అధికారుల మధ్య సమన్వయ లోపం..

కళ్యాణదుర్గంలో డ్రైనేజీ పనుల విషయంలో మున్సిపల్, ఆర్‌అండ్‌బీ అధికారుల మధ్య సమన్వయలోపం కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది. పనులు చేయించడంలో ఇరు శాఖల అధికారులు జాప్యం చేస్తున్నారనే విమర్శలు వినిస్తున్నాయి. కళ్యాణదుర్గంలో డ్రైనేజీ పనులు మున్సిపల్, ఆర్‌అండ్‌బీ శాఖలు సంయుక్తంగా చేపట్టాయి. గత ప్రభుత్వంలో రూ.4.44 కోట్లు విడుదలయ్యింది. కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత రూ.4.72 కోట్లు నిధులు మంజూరయ్యాయి. ప్రస్తుతం ఆయా నిధులతోనే పనులు జరుగుతున్నాయి.



పాత బస్టాండ్ ఆవరణలో మురుగునీరు ప్రవహిస్తున్న దృశ్యం



ప్రధాన రహదారి పక్కనే ప్రమాదకరంగా ఉన్న పెద్ద బండరాళ్లు

వ్యాపారాలు లేక వెల వెల...:

ఆరు నెలలుగా డ్రైనేజీ వ్యవస్థ బాగు చేసేందుకు పాత బస్టాండ్ సమీపంలో ఏర్పాటు చేసిన పెద్ద గుంత, గుంత నుంచి వచ్చే నీటితో పాత బస్టాండ్ మురుగు కూపంగా మారింది. తమ పొట్టకొట్టారని పాత బస్టాండ్ ఆవరణలో తోపుడు, బండ్లు, కిరాణా, వ్యాపారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పాత బస్టాండ్, టీ సర్కిల్, గాంధీ చౌక్ ప్రాంతాల్లో వంద కుటుంబాలకు పైగా పలు రకాల వ్యాపారాలు చేస్తూ జీవనం సాగిస్తున్నారు. డ్రైనేజీ వ్యవస్థతో ఆయా ప్రాంతాల్లో దుకాణాలున్న వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఉదయం నుంచి రాత్రి వరకు దుమ్మూ ధూళితో తీవ్ర అవస్థలు పడుతున్నట్లు స్థానికులు వాపోయారు.

త్వరలోనే పనులు చేపడతాం

టీ సర్కిల్ సమీపంలో ప్రధాన రోడ్డు పై కల్వర్టు పనులు ఆర్‌అండ్‌బీ పరిధిలో ఉంది. పాత బస్టాండ్‌లో డ్రైనేజీ వ్యవస్థ కోసం ఇప్పటికే టెండర్లు పిలిచాం. త్వరలోనే పనులు మొదలు పెడతాం. మున్సిపాలిటీ పరిధిలో డ్రైనేజీ వ్యవస్థను మార్చేందుకు చర్యలు చేపడుతున్నాం.

– వంశీకృష్ణ భార్గవ్, మున్సిపల్ కమిషనర్, కళ్యాణదుర్గం

దోమ కాటుతో ప్రాణాంతక రోగాలు

కూడేరు: దోమకాటుతో మలేరియా,డెంగీ వంటి ప్రాణాంతక రోగాలు వస్తాయని వైద్యాధికారిణి ఉషారాణి తెలిపారు. శుక్రవారం గొటుకూరు గ్రామంలో వైద్యాధికారులు డ్రైడే కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటా తిరిగి తొట్టిలు, డ్రమ్ములు, ఇతర పాత్రల్లో, పాత టైర్లల్లో, టెంకాయ చిప్పల్లో ఎక్కువ రోజులు నీరు నిల్వ ఉంచద్దని ప్రజలకు సూచించారు. రోడ్లపై నీరు నిల్వ ఉన్నచోట దోమలు వృద్ధి చెందకుండా వృధా ఆయిల్‌ను చల్లారు. కార్యక్రమంలో సూపర్ వైజర్ రవీంద్ర , ఎంఎల్‌హెచ్‌పీ చంద్రకళ, ఏఎన్‌ఎం భాను, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

'తల్లికి వందనం' వర్తింపజేయాలి

కుందుర్పి: సర్పంచు పిల్లలకు కూడా తల్లికి వందనం వర్తింపజేయాలని సర్పంచుల సంఘం మండల అధ్యక్షులు అతావుల్లా కోరారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. వైఎస్సార్‌సీపీ హయాంలో ప్రజాప్రతినిధుల పిల్లలకు 'అమ్మఒడి' వర్తింపజేశారన్నారు. కూటమి ప్రభుత్వం సర్పంచుల పిల్లలకు వర్తింపజేయకపోవడమేమిటని అన్నారు. సర్పంచులను ఉద్యోగులతో పోల్చి తల్లికి వందనం వర్తింపజేయకపోవడం బాధాకరమన్నారు. కార్యక్రమంలో సర్పంచులు రామూర్తి, ఓబన్న, గంగాధర, జగన్, విజయ్, బొమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వాస్పత్రుల్లో ప్రసవాలు సురక్షితం

కుందుర్పి: ప్రభుత్వాస్పత్రుల్లో ప్రసవాలు సురక్షితమని స్థానిక వైద్యాధికారిణి చాంద్‌బేగం పేర్కొన్నారు. శుక్రవారం కుందుర్పిలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో భాగంగా ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. గర్భిణులు, బాలింతలు, మహిళలు, వృద్ధులకు బీపీ, షుగర్, క్షయ పరీక్షలు చేసి, మందులు అందించారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎంలు, సిబ్బంది, మహిళలు పాల్గొన్నారు.

హెల్త్ సబ్ సెంటర్ల తనిఖీ



బొమ్మగానిపల్లిలో సబ్ సెంటర్‌లో రికార్డులు పరిశీలిస్తున్న దృశ్యం

బ్రహ్మసముద్రం : మండలంలోని కన్నేపల్లి, రాయలప్పదొడ్డి, బొమ్మగానిపల్లి హెల్త్ సబ్ సెంటర్లను మండల వైద్యాధికారి రాజేష్‌కుమార్ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన సబ్ సెంటర్లలో రికార్డులు పరిశీలించారు. ఎన్ సీడీ సర్వే పూర్తి చేయాలని సిబ్బందిని ఆదేశించారు. అనంతరం కన్నేపల్లి గ్రామంలో ఫ్రైడే డ్రైడేలో భాగంగా గ్రామం పర్యటించి, పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించారు. దోమ కాటుకు గురైతే చికున్‌గన్యా, మలేరియా, డెంగీ వస్తాయన్నారు. కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ రాణీ ఎస్తేర్, హెల్త్ అసిస్టెంట్ జాన్సన్ , ఎంఎల్ హెచ్‌పీలు మృదుళ, దీప్తి, ఏఎన్‌ఎంలు సువర్ణ, పంచాయతీ కార్యదర్శి యోగేష్, సచివాలయ సిబ్బంది, ఆశావర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

కానిస్టేబుల్‌కు సన్మానం



కానిస్టేబుల్ రవిని స్టేషన్ సిబ్బందితో కలసి సన్మానిస్తున్న ఎస్‌ఐ శివ

బెళుగుప్ప: స్థానిక పోలీస్ స్టేషన్‌లో పనిచేసే కానిస్టేబుల్ రవి కుందుర్పి మండలానికి బదిలీ కావడంతో ఆయన్ను శుక్రవారం సన్మానించారు. స్థానిక ఎస్‌ఐ శివ ఆధ్వర్యంలో పోలీసులు దుశ్శాలువా కప్పి, పూలమాలలు వేసి, సన్మానించారు. ఎస్‌ఐ మాట్లాడుతూ రవి అంకితభావంతో విధులు నిర్వర్తించేవారన్నారు. కార్యక్రమంలో ఏఎస్‌ఐ రామదాసు, పోలీసులు శివశంకర్, బాల నరసింహులు, మల్లికార్జున, జనార్దన, నాగభూషణ పాల్గొన్నారు.

అడుగులో అడుగై..
ఊరూవాడ ఏకమై

- ఆర్డీటీ పరిరక్షణకు కదం తొక్కిన జనం
- పదో రోజు ఉత్సాహంగా సాగిన పాదయాత్ర
- పాదయాత్రకు అన్ని వర్గాల మద్దతు





కర్తనపర్తిలో రంగయ్య పాదయాత్రలో పాల్గొన్న ప్రజలు , మహానేత డాక్టర్ వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తూ...

కళ్యాణదుర్గం: ఆర్డీటీని పరిరక్షించుకునేందుకు మాజీ ఎంపీ తలారి రంగయ్య చేపట్టిన పాదయాత్రకు ఊరూవాడా ఏకమై కదలివచ్చింది. ఆర్డీటీ పరిరక్షణ పాదయాత్రలో భాగంగా శుక్రవారం పాదయాత్ర పదో రోజుకు చేరుకుంది. ఉదయం కంబదూరు మండలం రాళ్ల అనంతపురం నుంచి ప్రారంభమైన పాదయాత్ర డీసీపల్లి, కర్తనపర్తి, నూతిమడుగు గ్రామాల వరకు సాగింది. అంతకు ముందు గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో జరిగిన విమాన ప్రమాద ఘటనలో మృతి చెందిన వారి ఆత్మకు శాంతి కలగాలని రెండు నిమిషాల పాటు మౌనం పాటించారు. అనంతరం జరిగిన పాదయాత్రకు ఆయా గ్రామాల ప్రజలు ఎదురు వచ్చి ఘన స్వాగతం పలికారు. నేతలకు తిలకం దిద్దుతూ పూలు చల్లుతూ ఆర్డీటీని రక్షించుకునేంత వరకూ మేమూ వెంట ఉంటామని అడుగులో అడుగు వేసి ముందుకు సాగారు. అన్ని గ్రామాల్లో ఆర్డీటీ లబ్ధిదారులు, ప్రజలు తాము పూరి గుడిసెలు వదిలి పక్కా ఇంటిలో ఉంటున్నామంటే అది ఫెర్రర్ చలువేనన్నారు. ఊరూరా దళిత కాలనీల్లో పర్యటిస్తూ వారికి ఆర్డీటీ అందించిన సేవలు తెలుసుకుంటూ ముందుకు సాగారు.

ఆర్డీటీని పరిరక్షించుకునే బాధ్యత అందరిదీ..

జిల్లాలో ఆర్డీటీ సేవలు ఆగిపోతే జరిగే నష్టాన్ని మాజీ ఎంపీ తలారి రంగయ్య ప్రజలకు వివరించారు. ఆర్డీటిని పరిరక్షించుకునే బాధ్యత తమపై ఉందన్నారు. పాదయాత్రలో స్వచ్ఛందంగా భారీగా తరలివచ్చారు. ఆయా కార్యక్రమాల్లో కళ్యాణదుర్గం మున్సిపాలిటీ కన్వీనర్ ఐ. సుధీర్, పార్టీ అధికార ప్రతినిధి గోపారం శ్రీనివాసులు, మార్కెట్ యార్డు మాజీ చైర్‌పర్సన్ బిక్కి నాగలక్ష్మి, కౌన్సిలర్లు శ్రీకాంత్, హరి, షేక్షావలి, ఇబ్రహీం , జాకీర్‌లు నేతలకు సన్మానం చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ గుద్దెళ్ల నాగరాజు, ఎంపీపీ లక్ష్మిదేవి, భీమేష్, పార్టీ మండల కన్వీనర్ హనుమంతరాయుడు, కంభం చంద్రశేఖర్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి తిమ్మరాయుడు వివిధ అనుబంధ సంఘాల నాయకులు ఆదెప్ప, నీలిశంకరప్ప, బయన్న, డాక్టర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు బొమ్మయ్య, కిరణ్, దాదు, ఫయాజ్, పాతలింగ, మీ సేవ కుమార్, మాజీ కన్వీనర్ బాలరాజు, ఎంపీటీసీలు మల్లేశు, భాస్కర్, మారెన్న, లింగమూర్తి, సోము, శ్యామంతరెడ్డి, సర్పంచులు అమర్, శివ, గంగాధర, చంద్ర, పరంధామరెడ్డి,రాళ్లపల్లి గంగాధర, మారెన్న, రవీంద్రరెడ్డి, మహారాజ, వన్నప్ప, తిప్పేస్వామి, అక్కులప్ప, ఎరుకుల పెద్దన్న, బోయ సురేష్, రాజన్న, రాళ్ల అనంతపురం రవి, శర్మస్, మాజీ ఎంపీటీసీ ఫక్రుద్దీన్, వెంకటేశులు, ముత్యాలప్ప, లక్ష్మీనారాయణ, శీనప్ప, రాము, రామ్మోహన్, లింగమూర్తి, డీసీ పల్లి గంగన్న, బోయ రమేష్, పెద్దరాజు, నరేష్, వేణు, కర్తనపర్తి మాధవయ్య, హనుమంతు, గూడురు మాధవయ్య, గంగన్న, నూతిమడుగు ఆనంద్, తిమ్మరాయుడు, వెల్డింగ్ బొమ్మన్న, గురుమూర్తి, గజ్జి రాజగోపాల్, సంజీవరాయుడు, నాగరాజు, ఎర్రిస్వామి, చాకలి నాగేంద్రలతో పాటు పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జిల్లా నేతల సంఘీభావం..

ఆర్డీటీ పరిరక్షణకు మాజీ ఎంపీ తలారి రంగయ్య చేస్తున్న పాదయాత్రకు జిల్లా పార్టీ నేతలు సంఘీభావం తెలిపారు. డీసీ పల్లి నుంచి కర్తనపర్తి వరకు పాదయాత్ర చేసి తమ మద్దతు ప్రకటించారు. మద్దతు తెలిపిన వారిలో పార్టీ ఎస్సీసెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చామలూరు రాజగోపాల్, టీటీడీ బోర్డు మాజీ సభ్యుడు అశ్వర్థ నాయక్, నేతలు రంగంపేట గోపాల్ రెడ్డి, వెన్నపూస రామచంద్రారెడ్డి, కణేకల్ మాజీ ఎంపీపీ రాజగోపాల్ రెడ్డి, నాయకులు లక్ష్మీకాంతరెడ్డి, ప్రభాకర్ రెడ్డి, కాడెప్ప, వంద్రప్ప, ఉమాపతి, జయరాములు, విరుపాక్షి, రమణారెడ్డి, రేవన్న, గోపాల్ రెడ్డి, ఎంపీపీలు చంద్రశేఖర్‌రెడ్డి, ఎస్.తిప్పేస్వామి, మల్లికార్జున, నరసింహారెడ్డి, అశోక్ రెడ్డి పాల్గొన్నారు.



అహ్మదాబాద్ విమాన ప్రమాద ఘటనలో మృతిచెందిన వారికి నివాళి అర్పిస్తున్న నేతలు



పాదయాత్రలో పాల్గొన్న వైఎస్సార్‌సీపీ నేతలు మీసాల రంగయ్య, అశ్వర్థనాయక్



డీసీపల్లిలో ఆర్డీటీ పరిరక్షణ కోసం నిండు గర్భిణి సైతం పాదయాత్రకు మద్దతు

నేతల సంఘీభావం

కణేకల్లు: తలారి రంగయ్య చేస్తున్న పాదయాత్రకు కణేకల్లు మండలంలోని వైఎస్సార్‌సీపీ నాయకులు సంఘీభావం తెలిపారు. కంబదూరు మండలంలోని కర్తనపర్తి, రాళ్ల అనంతపురం, నూతిమడుగు గ్రామాల్లో శుక్రవారం జరిగిన తలారి రంగయ్య పాదయాత్రలో వైఎస్సార్‌సీపీ రైతు విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మాజీ ఎంపీపీ ఆలేరి రాజగోపాల్‌రెడ్డి, బీసీసెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి వేమన, 43ఉడేగోళం ఎంపీటీసీ గోపాల్, శరబయ్య, మాజీ ఎంపీటీసీ రమణరెడ్డి, మాజీ సర్పంచులు జేజేటీ ప్రభాకర్‌రెడ్డి, కాడెప్ప, వైఎస్సార్‌సీపీ నాయకులు ఆలేరి లక్ష్మీకాంతరెడ్డి, మారెంపల్లి రామన్న, గోవర్ధన్‌రెడ్డి తదితరులు సంఘీభావం తెలిపారు.



పాదయాత్రకు మద్దతు తెలుపుతున్న కణేకల్ మాజీ ఎంపీపీ రాజగోపాల్ రెడ్డి, పార్టీ నేతలు

తాగునీటి పథకానికి మోక్షమెన్నడో?



పెద్దముష్టూరులో తాగునీటి పథకం ట్యాంకు వద్ద మరమ్మతుకు గురైన బోరు

ఉరవకొండ రూరల్: పెద్దముష్టూరులో ఉరవకొండ నుంచి కళ్యాణదుర్గం వెళ్లే ప్రధాన మార్గంలో ట్యాంకుకు ఏర్పాటు చేసిన బోరు మరమ్మతుకు గురై నెలలు గడుస్తున్నా పట్టించుకోలేదు. ఇక్కడ ఉన్న బోరు రిపేరి చేసి అందుబాటులోకి తెస్తే చుట్టుపక్కల ఉన్న సుమారు వంద కుటుంబాలకు తాగునీరు అందుతుందని స్థానికులు చెప్తున్నారు. ప్రస్తుతం పదిహేను రోజులకోసారి తాగునీరు సరఫరా అవుతోందని వారంటున్నారు. అధికారులు, స్థానిక ప్రజా ప్రతినిధులు స్పందించి బోరును రిపేరీ చేయించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

శాంతిధామం..అవధూత ఆశ్రమం

- భక్తుల కొంగుబంగారం సద్గురు ఎర్రితాతస్వామి
- ప్రారంభమైన అవధూతస్వామి ఆలయ వార్షికోత్సవం
- నేడు ఎర్రితాతస్వామివారి ప్రభోత్సవం



అవధూత ఎర్రితాతస్వామి మూలవిరాట్

బెళుగుప్ప: మండల కేంద్రంలో వెలసిన అవధూత సద్గురు ఎర్రితాతస్వామి కొలిచిన భక్తులకు కొంగు బంగారంగా వెలుగొందుతున్నారు. అవధూత ఎర్రితాతస్వామి ఎనిమిదిన్నర దశాబ్దాల క్రితం ఆధ్యాత్మిక బోధనలు చేస్తూ కర్ణాటక ప్రాంతం నుంచి బెళుగుప్పకు వచ్చారు. ఈ ప్రాంత ప్రజలతోపాటు పొరుగు రాష్ట్రం కర్ణాట ప్రాంత ప్రజలకు మహిమలు చూపి మహిమాన్విత అవధూతగా పేరుగాంచారు. ఎన్నో మహిమలు చూపిన ఆయన.. 1936లో స్థానిక శాంతిధామంలోనే భక్తుల సమక్షంలో జీవసమాధి పొందారు. శాంతిధామంలో వెలసిన ఎర్రితాతస్వామిని పూజిస్తే వంశవృద్ధి, రోగాలు నయం చేయడం. కష్టాలను దరిచేరవనేది నేటికీ భక్తు ప్రగాఢ విశ్వాసం.



సద్గురు ఎర్రితాతసమాధి

దినదిన ప్రవర్ధమానంగా ఆలయ విస్తరణ:

శాంతిధామంగా కీర్తింపబడుతున్న ఆశ్రమంలో నాడు అవధూత సద్గురు ఎర్రితాత జీవ సమాధి నాలుగు గోడల మధ్య చిన్న గదిలో ఉండేది. నేడు భక్తుల దాతృత్వంతో ఆలయ ప్రాంగణం శాంతి ధామంగా వెలసి భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఆలయ సేవా కమిటీ శాంతిధామాన్ని తీర్చిదిద్దింది. అందులోనే శ్రీకృష్ణ మందిరం, గణపతి మందిరం, మహాలక్ష్మి మందిరాలతో పాటు స్వామి వారి కృప ఉన్న వంశవృద్ధి ఊయల, బసవన్నల మందిరాలను నిర్మించారు. ఆలయ ప్రాంగణంలో ప్రశాంత వాతావరణం ఉంటుంది. పచ్చని చెట్లను పెంచి రాతి రథచక్రాలు, శివకైలాసం, విడిది గదులతో పాటు ఆహ్లాదకరమైన వాతావరణం ఉంటుంది.

ప్రారంభమైన వార్షిక ఆరాధనోత్సవాలు..

స్థానిక శాంతిధామంలో శుక్రవారం ప్రారంభమైన ఉత్సవాలు ఆదివారం వరకు సద్గురు ఎర్రితాత 89వ ఆరాధనోత్సవాలు జరగనున్నాయి.ఏటా జ్యేష్ఠమాసం బహుళ విదియ రోజున ఉత్సవాలు మొదలై జ్యేష్ఠ బహుళ చవితి వరకు కొనసాగిస్తారు. శుక్రవారం బహుళ విదియ రోజు సందర్భంగా నాందీపూజ, గణపతి పూజ, గోపూజ, కలశ స్థాపన, గంగపూజ, ధ్వజారోహణ, స్వస్తి పుణ్యాహవాచకం, రాత్రికి నంది వాహన సేవ పూజలు ఆలయంలో నిర్వహించారు. శనివారం జ్యేష్ఠ బహుళ తదియ సందర్భంగా మహా గణపతి పూజ, సహస్ర మూలికా పంచామృతాభిషేకం, బిల్వార్చన, పల్లకీసేవ, సాయంత్రం శేషతల్ప అలంకరణలు, భక్త జనం సందోహం మధ్య రాత్రి 10 గంటల నుంచి వీధుల్లో స్వామివారి ప్రభోత్సవ ఊరేగింపు ఉంటుంది. ఆదివారం అభిషేకాలు, అర్చనలు, మహామంగళ హారతి, చవితి సందర్భంగా ఛత్రప్రభ అలంకారం, యువత ఉత్సాహంగా పాల్గొనే ఉట్లపరుష, రాత్రికి భజనలు, ఎర్రితాత కోలాట కార్యక్రమాలు ఉంటాయి.

రథోత్సవం నిర్వహణ..

ఎర్రితాతస్వామి ఉత్సవాలకు ప్రభోత్సవ స్థానంలో రథోత్సవం నిర్వహించేందుకు తేరు నిర్మాణ ఏర్పాటుకు సేవా కమిటీ సభ్యులు సంకల్పించారు. తేరు నిర్మాణానికి దాతల నుంచి విరాళాల సేకరణ ప్రారంభమైందని దాతలు భూరి విరాళాలతో పవిత్రయజ్ఞంలో పాల్గొని, స్వామి కృపకు పాత్రులు కాగలరని ఆలయ నిర్వహణ సభ్యులు తెలిపారు.

సంక్షిప్త సమాచారం

కణేకల్లు ఏఓ ఆర్‌డీ జగదీష్‌బాబు బాధ్యతలు



కణేకల్లు: కణేకల్లు వ్యవసాయాధికారిగా ఆర్‌డీ జగదీష్ బాబు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఏఓగా పని చేస్తున్న ఏ.శ్రవణ్‌కుమార్ కళ్యాణదుర్గానికి బదిలీ అయ్యారు. అక్కడ పని చేస్తున్న జగదీష్‌బాబు కణేకల్లుకు బదిలీపై వచ్చారు. రైతులకు అందుబాటులో ఉండి మెరుగైన సేవలు అందిస్తామన్నారు.

ఉరవకొండ ఏఓగా రామకృష్ణ



ఉరవకొండ రూరల్: ఉరవకొండ మండల వ్యవసాయాధికారిగా రామకృష్ణ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన గుంతకల్లు నుంచి ఉరవకొండకు బదిలీపై వచ్చారు. ఇక్కడ వ్యవసాయాధికారిగా ఉన్న శుభకర్ కూడేరు మండలానికి బదిలీ అయ్యారు. రామకృష్ణ మాట్లాడుతూ రైతులకు నిత్యం అందుబాటులో ఉంటూ సేవలందిస్తామని తెలిపారు.

పైప్‌లైన్ పనులకు భూమి పూజ

రాయదుర్గంటౌన్: పట్టణంలోని 20వ వార్డు పైతోటకు హెచ్చెల్సీ తాగునీటి పథకం పైప్‌లైన్ పనులకు ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు శుక్రవారం భూమి చేశారు. గతంలో జాతీయ రహదారి నిర్మాణం సమయంలో పైతోటకు పైప్‌లైన్ ఏర్పాటులో జాప్యం జరిగింది. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ దివాకర్‌రెడ్డి, వార్డు కౌన్సిలర్లు పైతోట సంజీవప్ప, ప్రశాంతి, జ్యోతి పాల్గొన్నారు.

బొగ్గుల బట్టీలను తొలగించండి

కుందుర్పి: బండమీదపల్లి, కదరంపల్లి, బసాపురం, అల్లాపురం గ్రామాల్లో బొగ్గుల బట్టీలను తొలగించాలని ఆయా గ్రామాల ప్రజలు తహసీల్దార్ శ్రీనివాసులుకు శుక్రవారం వినతిపత్రం అందించారు. వారు మాట్లాడుతూ అన్ని గ్రామాల్లో సమీపంలోనే బట్టీలు ఉండడంతో తద్వారా పొగతో ప్రజలు, చిన్నపిల్లలు రోగాల బారిన పడుతున్నారని బసాపురం రామప్ప,ఈరన్న, లక్ష్మీపతి అన్నారు. బట్టీలతో బండమీదపల్లి సమీపంలో ఇటీవల ఇద్దరు చిన్నారులు మృతి చెందిన విషయం తెలిసిందే. చుట్టుపక్కల ఉన్న మల్బరీ, చీనీ తదితర పంటలు దెబ్బతింటున్నాయని రైతులు మంజునాథ్, కృష్ణమూర్తి, రాంప్రసాద్ తదితరులు తెలిపారు.

రాకెట్లలో విరబూసిన బ్రహ్మకమలం



బ్రహ్మకమలాలకు పూజలు చేస్తున్న అశోక్ దంపతులు

ఉరవకొండ: మండల పరిధిలోని రాకెట్ల గ్రామంలోని వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి అశోక్, అనిత దంపతుల ఇంట్లో బ్రహ్మకమలాలు శుక్రవారం విర బూశాయి. ఒకే కొమ్మకు పదుల సంఖ్యలో పూలు పూశాయి. గ్రామస్తులు పూజలు నిర్వహించారు.